# తొలి అక్షరం

చైర్మన్ & చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

తెలుగు దిన పత్రిక

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 02 సంచిక - 143 పేజీలు - 6 గురువారం 17 ఏప్రిల్ 2025


## భారీగా పెరిగిన బంగారం ధరలు

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,ఏప్రిల్16:** ప్రపంచవ్యాప్తంగా చోటు-చేసుకుంటు-న్న వాణిజ్య మార్పులు భారత మార్కెట్‌పై భారీ ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ఈ క్రమంలోనే దేశ రాజధాని ఢిల్లీలో బుధవారం 24 క్యారెట్ల బంగారం ధరలు రూ.1,650 పెరిగి 10 గ్రాములకు రూ.98, 100కు చేరాయి. ఇదే సమయంలో 99.5 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర కూడా రూ.1,650 పెరిగి రూ.97, 650 స్థాయికి చేరుకుంది. ఈ ధరలు ప్రస్తుతం ఆల్ -టైం గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. అమెరికా-చైనా వాణిజ్య సంబంధాల్లో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అనేక మంది కూడా సురక్షితమైన బంగారం పెట్టు-బడులపైన ఫోకస్ చేస్తున్నారు.

## బయటి రాష్ట్రంలో బొగ్గు తవ్వకాలు అభినందనీయం...

- సింగరేణి సంస్థను అభినందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**తొలి అక్షరం/హైదరాబాద్, ఏప్రిల్ 16:** సింగరేణి సంస్థ చరిత్రలో మొదటిసారి బయటి రాష్ట్రంలో బొగ్గు తవ్వకాలు ప్రారంభించడం అభినందనీయమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.



దాదాపు 130 ఏళ్లుగా తవ్వకాలు సాగిస్తూ రాష్ట్రానికి వెలుగులు పంచుతున్న తెలంగాణ సింగరేణి రాష్ట్రం బయట ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాకులో తవ్వకాలు ప్రారంభించి భవిష్యత్తు తరాలకు బంగారు బాటలు వేసిందని పేర్కొన్నారు. ఒడిశాలోని అంగుల్ జిల్లాలో సింగరేణి సంస్థ తనకు కేటాయించిన బొగ్గు గనులకు అన్ని అనుమతులు సాధించి అందులో తవ్వకాలు ప్రారంభించడం శుభ పరిణామంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇది తెలంగాణ చరిత్రలో నిలిచిపోయే సందర్భమని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సింగరేణి సంస్థకు అభినందనలు తెలియజేశారు.

## వక్ఫ్ రాజ్యాంగ బద్ధతపై సుప్రీం విచారణ

- స్టే ఇవ్వడానికి సుప్రీం ధర్మాసనం నిరాకరణ
- విచారణ నేటికి వాయిదా వేసిన ధర్మాసనం



**తొలి అక్షరం/న్యూఢిల్లీ,ఏప్రిల్ 16:** వక్ఫ్ సవరణ చట్టం-2025 రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిష న్లపై బుధవారం విచారణ జరిగింది. వక్ఫ్ చట్టంపై స్టే విధించేందుకు సుప్రీం నిరాక రించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం వాటిని విచారించింది. వక్ఫ్ చట్టరూపాన్ని ఆర్టికల్ 26 నిరోధిం చదని, ఆ రాజ్యాంగ నిబంధన సార్వత్రిక మైందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అందరికీ వర్తించే ఈ నిబంధన లౌకికమైన స్వభాన్ని కలిగిఉందని చెప్పింది. అలాగే కేంద్రానికి పలు ప్రశ్నలు సంధించింది. ఈ మేరకు నోటీసులు జారీచేసింది. వందల ఏళ్లనాటి ఆస్తులకు పత్రాలు ఎక్కడినుంచి వస్తాయని ప్రశ్నించింది. వక్ఫ్ చట్టంపై ఆందోళనల్లో హింస చోటుచేసుకోవడం బాధాకరమని వ్యాఖ్యానించింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది కపిల్ సిబల్ అత్యున్నత న్యాయస్థానంలో వాదనలు వినిపించారు. ఈ చట్టం జాతీయస్థాయి పరిణామాలను కలిగి ఉందని, ఈ పిటిషన్లను హైకోర్టుకు రిఫర్ చేయొద్దని మరో సీనియర్ వివరాలు 2లో

## వర్సిటీ భూములపై సర్కార్‌కు చెంపదెబ్బ

- కంచగచ్చబౌలి భూములపై సుప్రీం సీరియస్
- సుప్రీం మార్గదర్శకాలు విస్మరించి చెట్ల నరికివేతపై ఆగ్రహం
- ఆ భూముల్లోనే తాత్కాలిక జైలు నిర్మించి అధికారులను వేస్తాం
- నాలుగు వారాల్లో పునరుద్దరణ నివేదిక సమర్పించాలని ఆదేశం
- స్టేటస్‌కో కొనసాగుతుందని వెల్లడి...విచారణ మే 15కు వాయిదా



**తొలి అక్షరం/న్యూఢిల్లీ,ఏప్రిల్ 16:** కంచ గచ్చిబౌలి భూముల అంశంపై సుప్రీంకోర్టులో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. చెట్ల నరికివేతపై రేవంత్ సర్కార్‌పై సర్వోన్నత న్యాయ స్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. చెట్లు కొట్టేసే ముందు అనుమతులు తీసుకున్నారో లేదో స్పష్టంగా చెప్పాలని జస్టిస్ బీఆర్ గవాయి నిలదీశారు. సీఎస్‌ను కాపాడాలని అనుకుంటే.. వంద ఎకరాలను ఎలా పునరుద్ధిస్తారో చెప్పాలని అన్నారు. వివరాలు 2లో

## దేశాన్ని లూటీ చేసిన నెహ్రూ కుటుంబం

- దేశాన్ని అవినీతమయంగా చేశారు
- కాంగ్రెస్ హయాంలోనే నేషనల్ హెరాల్డ్ కేసు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపాటు



**తొలి అక్షరం/న్యూఢిల్లీ,ఏప్రిల్ 16:** నెహ్రూ కుటుంబం దేశాన్ని లూటీ చేసిందని.. అంతే కానీ.. దేశానికి ఆ కుటుంబం ఏం చేయలేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఆ క్రమంలో దేశాన్ని అవినీతిమయంగా మార్చిన విషయం మనం చూస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే నేషనల్ హెరాల్డ్ కేసు వచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీతోపాటు- ఆ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై మంత్రి జి.కిషన్ రెడ్డి మరోసారి నిప్పులు చెరిగారు. బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి వివరాలు 2లో

## సుప్రీం తదుపరి సిజెగా జస్టిజ్ బిఆర్ గవాయ్

- సిఫారసు చేసిన కొలీజియం

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,ఏప్రిల్ 16:** భారత సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తి గా జస్టిస్ బీఆర్ గవాయ్ నియమితులయ్యారు. కొలీజియం సిఫారసుల మేరకు ప్రస్తుత భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ గవాయ్ పేరును ప్రతిపాదించారు. వచ్చే నెల 13న జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవీ కాలం ముగియనుం డటంతో ఆయన స్థానంలో కొత్త ప్రధాన న్యాయమూర్తిని ప్రకటిం చారు. జస్టిస్ గవాయ్ మే 14న సీజేఐగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. కాగా డీవై చంద్రచూడ్ పదవీ విరమణతో ప్రస్తుత సీజేఐ సంజీవ్ ఖన్నా 2024 నవంబర్‌లో ప్రమాణస్వీకారం చేశారు. గవాయ్ పూర్తిపేరు భూషణ్ రామకృష్ణ గవాయ్. ఆయన 1960 నవంబర్ 24న అమ్రావతిలో జన్మించారు. 1985 మార్చి 16న బార్‌లో సభ్యుడిగా చేరారు.

## నేటి నుంచి భూభారతి అవగాహన సదస్సులు

- నాలుగు మండలాల్లో పైలెట్ ప్రాజెక్టుగా అమలు
- ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రారంభించనున్న పొంగులేటి



**తొలి అక్షరం/హైదరాబాద్,ఏప్రిల్16:** ధరణి స్థానంలో తీసుకుని వచ్చిన తెలంగాణ భూ భారతి కార్యక్రమం గురువారం నుంచి నాలుగు మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు కానుంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా ప్రవేశపెడుతున్న భూభారతి పైలట్ ప్రాజెక్టు రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో ప్రారంభించనున్నారు. ములుగు జిల్లా వెంకటాపురం, ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, కామారెడ్డిలోని లింగంపేట, నారాయణపేట జిల్లా మద్దూర్ మండలంలోని ఖాజీపురంలో భూ భారతి పైలట్ ప్రాజెక్టు ప్రారంభించనున్నారు.. ఉమ్మడి వివరాలు 2లో




## సుప్రీం తీర్పును స్వాగతించిన బిఆర్ఎస్

- ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలన్న కెటిఆర్

**తొలి అక్షరం/హైదరాబాద్,ఏప్రిల్16:** కంచె గచ్చిబౌలి భూములపై సుప్రీంకోర్టు ఆదేశాలను భారత రాష్ట్ర సమితి స్వాగతం తెలిపింది.ఇది ప్రభుత్వానికి గుణపాఠం కావాలని అన్నారు. కంచ గచ్చిబౌలిలో ధ్వంసం చేసిన అడవులను పునరుద్ధరించాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను స్వాగతిస్తున్నట్లు పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు రాష్ట్ర చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్‌కు వన్యప్రాణులను వివరాలు 2లో

## వరుసగా రెండోరోజూ ఈడి విచారణకు వాద్రా

- భర్త వెంట వచ్చిన ప్రియాంక గాంధీ



**తొలి అక్షరం/న్యూఢిల్లీ,ఏప్రిల్ 16:** హరియాణా భూ ఒప్పందానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసు విచారణలో భాగంగా రాబర్ట్ వాద్రా వరుసగా రెండోరోజు ఇడి ముందు హాజరయ్యారు. ఇది కక్షపూరిత కేసని అన్నారు. ఎప్పుడో పాత కేసులో మళ్లీ ఇప్పుడు విచా రణ ఏమిటని ప్రశ్నించారు. రాబర్ట్ వాద్రా బుధవారం మరోసారి ఈడీ కార్యాలయానికి వచ్చారు. ఈసందర్భంగా ఆయన వెంట ప్రియాంక కూడా ఉన్నారు. కేసుకు సంబంధించి వాద్రాకు ఈడీ మంగళవారం నోటీసులు జారీ చేసి తమముందు హాజరు కావాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. నోటీసులు అందిన అనంతరం ఆయన నడుచుకుంటూ కార్యాలయానికి వెళ్లారు. దాదాపు ఐదు గంటల పాటు- ఆయన వాంగ్మూలాన్ని రికార్డు చేయగా.. బుధవారం కూడా హాజరుకావాలని ఆదేశించారు. ఈక్రమంలోనే ఆయన తాజాగా ఈడీ కార్యాలయానికి వచ్చారు. ఆయన వెంట ప్రియాంక కూడా ఉన్నారు. ఈసందర్భంగా వాద్రా లోపలికి వెళుతుండగా ప్రియాంక ఆలింగనం చేసుకున్నారు. దీనికి సంబంధిం చిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వివరాలు 2లో

## గాంధీ కుటుంబంపై బీజేపీ కక్షసాధింపు ధోరణి నశించాలి

- దేశంకోసం ప్రాణాలర్పించిన గాంధీ కుటుంబాన్ని బద్నామ్ చేస్తున్న బీజేపీ
- దేశం మొత్తం గాంధీ కుటుంబానికి సానుభూతి తెలుపుతుంది
- దేశంలో అనేక మంది నిరవ్ మోదీలు దేశాన్ని దోచుకుంటే చర్యలు శూన్యం
- మండిపడ్డ తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**తొలి అక్షరం/హుస్నాబాద్, ఏప్రిల్ 16:** గాంధీ కుటుంబంపై బీజేపీ కక్షసాధింపు ధోరణి నశించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై ఈడి చార్జిషీట్ లకు నిరసనగా బీజేపీకి వ్యతిరేకంగా హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలోనీ అంబేద్కర్ చౌరస్తా వద్ద మంత్రి పొన్నం ప్రభాకర్ భారీ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో హుస్నా బాద్ నియోజకవర్గంలోని ఏడు మండలాల కాంగ్రెస్ కార్యకర్తలు, ముఖ్య నేతలు,అనుబంధ సంఘాల నేతలు, యూత్ కాంగ్రెస్, ఎన్.ఎస్. యూ.ఐ మహిళా కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీల ఈడి వేధింపులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారంటూ బీజేపీకి వ్యతిరేకంగా మోడీ, బీజేపీ కుట్రపూరిత వైఖరి నశించాలి అంటూ నినాదాలు చేశారు. వివరాలు 2లో

# సుప్రీం తీర్పును స్వాగతించిన బిఆర్ఎస్

(మొదటి పేజీ తరువాయి)

కాపాడాలంటూ ఆదేశాలు ఇవ్వడం గొప్ప విజయమని పేర్కొన్నారు.. వన్యప్రాణుల పట్ల, పర్యావరణ పరిరక్షణకు పాటుపడే ప్రతి ఒక్కరికి దక్కిన విజయం అంటూ పేర్కొన్నారు. గొంతులేని మూగజీవాల కోసం, చెట్ల కోసం, పర్యావరణం కోసం అండగా నిలబడిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు.సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన కేంద్ర సాధికారిక కమిటీ ఇచ్చిన సిఫార్సులను కూడా భారత రాష్ట్ర సమితి స్వాగతిస్తున్నదని పేర్కొన్నారు. కంచ గచ్చిబౌలిని ప్రైవేట్ పార్టీకి తాకట్టు పెట్టిన రేవంత్ రెడ్డి ప్రభుత్వ వ్యవహారంలో ఆర్థిక అవకతవకలు జరిగే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేసిన కేంద్ర సాధికారిక కమిటీ– మా పార్టీ వాదనను బలపరుస్తున్నదని తెలిపారు. కంచ గచ్చిబౌలి భూముల తాకట్టు– విషయంలో పదివేల కోట్ల రూపాయల అవినీతికి రేవంత్ రెడ్డి పాల్పడ్డారని చేసిన ఆరోపణలను పునరుద్ఘాటించారు. అడవుల పట్ల, వన్యప్రాణుల పట్ల రేవంత్ రెడ్డి నెంబర్ వన్ విలన్‌గా మారాడని విమర్శించారు. పర్యావరణ విధ్వంసానికి... పర్యావరణ హత్యకు పాల్పడి తప్పించుకోలేరనే కనీస సోయి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇకనైనా వస్తుందని ఆశాభావం వ్యక్తం చేసారు సీఎం రేవంత్ రెడ్డి తనను తాను మోసం చేసుకున్న విషయాన్ని అర్థం చేసుకుని పర్యావరణ విధ్వంసం ఆపాలని కోరారు.

# నీటి కరువుకు కాంగ్రెస్‌దే బాధ్యత

**- మాజీ మంత్రి హరీష్ రావు విమర్శలు**

**తొలి అక్షరం/హైదరాబాద్,ఏప్రిల్16:** వేసవి నేపథ్యంలో రాష్ట్రంలోని పలుచోట్ల భూగర్భజలాలు తగ్గడం, నీటి ఎద్దడి పెరగడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఇన్నాళ్లు సాగు నీళ్ల కోసం రైతుల గోస పడితే.. ఇప్పుడు తాగు నీళ్ల కోసం ప్రజల ఘోష పడాల్సి వస్తుందని అన్నారు. కాంగ్రెస్ పాలనలో పొలాలు తడారిపోతున్నాయని.. ప్రజల బతుకులు ఎడారి అయిపోతున్నాయని ఆవేదన చెందారు.కాంగ్రెస్ నాయకులు ముందుచూపు లేమి, నిర్లక్ష్యంతో ప్రాజెక్టులో నీళ్లు ఒడిసిపట్టలేదని.. చెరువులు నింపలేదని, భూగర్భ జలాలు పెంచలేదని హరీశ్‌రావు తెలిపారు. ఇప్పుడు మిషన్ భగీరథ ద్వారా నీళ్ళు సరఫరా చేయడం లేదని అన్నారు. కేసీఆర్ ఇంటింటికీ నల్లాలు ఏర్పాటు– చేసి తాగు నీళ్లిస్తే, రేవంత్ రెడ్డి కనీసం ఆ పథకాన్ని కొనసాగించలేక పోతున్నాడని విమర్శించారు. ఉమ్మడి పాలన నాటి బిందెలు, డ్రమ్ములు మళ్లీ రోడ్లపై కనిపిస్తున్నాయని తెలిపారు. తెలంగాణ ఆత్మగల్ల పాలకుడికి, తెలంగాణ ప్రయోజనాలు పట్టని పాపాత్ముడికి ఉన్న తేడా ఇది అని వివరించారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదు, ఇది కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కృత్రిమ కరువు అని హరీశ్‌రావు విమర్శించారు. రేవంత్ రెడ్డి పాలనావైఫల్యం తెచ్చిన ప్రజల క'న్నీటి' కరువు అని అన్నారు. ఇకనైనా, ముఖ్యమంత్రి, మంత్రులు అబద్దాల ప్రవాహాన్ని పారించడం మానేసి, ప్రజల ఇళ్లకు తాగు నీటిని పారించాలని ఎక్స్ వేదికగా సూచించారు.

# జపాన్ చేరుకున్న సిఎం రేవంత్

**తొలి అక్షరం/హైదరాబాద్,ఏప్రిల్16:** వారం రోజుల పర్యటన నిమిత్తం తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి బృందం జపాన్ చేరుకుంది. అక్కడి భారత రాయబారి శింబు జార్జ్.. సీఎం, అధికారులకు ఆతిథ్య విందు ఇచ్చారు. టోక్యోలోని వందేళ్ల నాటి ఇండియా హౌజ్‌లో ఇచ్చిన విందులో సీఎం రేవంత్ బృందంతో పాటు– పలువురు తమిళనాడుకు చెందిన ఎంపీలు పాల్గొన్నారు. వివిధ అంశాలపై రాయబారి, తమిళ ఎంపీలతో సీఎం రేవంత్ చర్చించారు. సీఎం రేవంత్‌రెడ్డి.. గురువారం టోక్యోలోని సోనీ గ్రూప్, జపాన్ ఇంటర్నేషనల్ కో–ఆపరేషన్ ఏజెన్సీ.. జెట్రో, జపాన్ బయో ఇండస్ట్రీ అసోసియేషన్, వివిధ సంస్థలతో సమావేశం కానున్నారు. సాయంత్రం తోషిబా ఫ్యాక్టరీని రాష్ట్ర బృందం సందర్శించనుంది. ఐటీ–, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు బుధవారం రాత్రి హైదరాబాద్ నుంచి బయలుదేరి గురువారం జపాన్ చేరుకోనున్నారు.

## సిఎం విజయన్, కుమార్తె వీణలకు నోటీసులు

**తొలి అక్షరం/తిరువనంతపురం,ఏప్రిల్16:** ఎక్సోలాజిక్ మంత్లీ పేమెంట్ కేసుకు సంబంధించి కేరళ సీఎం విజయన్, అతని కుమార్తె వీణా విజయన్ కు కేరళ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేస్తూ జర్నలిస్ట్ అజయన్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం ఆధారంగా నోటీసులిచ్చింది. ఈ పిటిషన్ ను ఇంకా కోర్టు ఫైల్ లోకి స్వీకరించనప్పటికీ అంతకుముందే కేసులో ప్రమేయం ఉన్న అన్ని పార్టీలకు నోటీసులు పంపాలని హైకోర్టు ఆదేశించింది. ఇతర ప్రతివాదులుగా అధికారులను చేర్చింది. ఆదాయపు పన్ను శాఖ నివేదిక ఆధారంగా ఈ విషయంపై సీబీఐ దర్యాప్తు జరపాలని అజయన్ పిటిషన్‌లో డిమాండ్ చేశారు. ఈ కేసులో విజిలెన్స్ దర్యాప్తు కోరుతూ గతంలో దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు ఇప్పటికే కొట్టివేసింది. ఆదాయపు పన్ను పరిష్కార బోర్డు నివేదికలో పేర్కొన్న పేర్లను సమర్పించాలని కూడా కోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.ఈ కేసు వేసవి సెలవుల తర్వాత మే 27న మళ్లీ హైకోర్టు విచారించనుంది.

## వక్ఫ్ రాజ్యాంగ బద్దతపై

# సుప్రీం విచారణ

(మొదటి పేజీ తరువాయి)

న్యాయవాది అభిషేక్ సింఘ్వీ కోరారు. వక్ఫ్ బై యూజర్ అనేది ఎప్పటినుంచో అమల్లో ఉన్న పద్ధతి అని మరో న్యాయవాది హుజేఫా అహ్మదీ వెల్లడించారు. మరోపక్క.. ప్రభుత్వం ఏర్పాటు– చేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ వక్ఫ్ బిల్లుపై విస్తృత చర్చ జరిపిందని కేంద్రం కోర్టుకు వెల్లడించింది. అనంతరం కోర్టు విచారణను రేపటికి వాయిదా వేసింది. ఇటీవల పార్లమెంట్ ఆమోదం పొందిన వక్ఫ్ సవరణ చట్టం ఏప్రిల్ 8 నుంచి అమల్లోకి వచ్చింది. ఇటీవల మోదీ సర్కారు ఆమోదించిన వక్ఫ్ బిల్లు చట్టభద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ల పై సుప్రీం కోర్టు విచారణ ప్రారంభించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ విచారణ చేపట్టింది. వక్ఫ్ బిల్లు చట్టభద్ధతను సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో 10 పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లు దాఖలు చేసిన వారిలో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ, కాంగ్రెస్ ఎంపీ మహమ్మద్ జావేద్, టీఎంసి ఎంపీ మహువా మొయిత్ర, ఎస్పీ ఎంపీ జియా ఉర్ రెహమాన్, అర్జేడి ఎంపీ మనోజ్ కుమార్ ఝ, ఆప్ ఎమ్మెల్యే అమనాతుల్లా ఖాన్, మణిపూర్ ఎమ్మెల్యే షేక్ నూరుల్ హాసన్, వైసీపీ, డిఎంకె, టీవికే అధినేత విజయ్, సిపిఐ సహా కొన్ని ముస్లిం సంఘాలు ఉన్నాయి. ఇక, పిటీషనర్ల తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ వాదనలు వినిపించారు. మరోవైపు వక్ఫ్ బోర్డు సవరణ చట్టంను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ల విచారణకు ముందు తమ వాదనలు కూడా వినాలని పలు రాష్ట్రాలు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. పిటిషన్లు దాఖలు చేసిన రాష్ట్రాల్లో అస్సాం, రాజస్థాన్, ఛత్తీస్‌ఘఢ్, ఉత్తరాఖండ్, హర్యానా, మహారాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయి. వీరంతా ఈ చట్టాన్ని సమర్థిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇక, కపిల్ సిబాల్ వాదనల ప్రకారం పార్లమెంటు చట్టం ద్వారా మత విశ్వాసంలో కీలకమైన అంతర్భాగ అంశాలలో తలదూర్చారని కపిల్ సిబాల్ అత్యున్నత న్యాయంస్థానం ముందుకు తీసుకెళ్లారు. ఆర్టికల్ 25, 26లకు వ్యతిరేకంగా వక్ఫ్ సవరణ చట్టం ఉందని కపిల్ సిబాల్ అన్నారు.

# వర్సిటీ భూములపై సర్కార్‌కు చెంపదెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

దీనిపై నాలుగు వారాల్లో ప్రణాళిక సిద్ధం చేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి విచారణను మే 15వ తేదీకి వాయిదా వేశారు. అప్పటి వరకు స్టేటస్ కో కొనసాగుతుందని అన్నారు. కంచ గచ్చిబౌలి భూముల అంశంపై జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా చెట్లు కొట్టివేసే ముందు అనుమతులు తీసుకున్నారో లేదో స్పష్టంగా చెప్పాలని జస్టిస్ బీఆర్ గవాయి ప్రశ్నించారు. దీనికి ప్రభుత్వ తరపున లాయర్ స్పందిస్తూ జామాయిల్ తరహా చెట్లు–, పొదలను అనుమతి తీసుకునే తొలగించామని తెలిపారు. అందుకు చెట్ల నరికివేతపై సమర్థించుకోవద్దని జస్టిస్ బీఆర్ గవాయి ఆగ్రహం వ్యక్తం చేశారు. 1996లో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం అనుమతులు తీసుకున్నారో లేదో చెప్పాలన్నారు. వారంతపు సెలవుల్లో మూడు రోజుల్లో చెట్లు కొట్టాల్సిన తొందర ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. మీరు చెట్లు కొట్టడం వల్ల అక్కడ జంతువుల మీద కుక్కలు దాడి చేస్తున్నాయని.. ఆ వీడియోలను చూసి ఆందోళనకు గురయ్యామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అవసరమైతే 2400 ఎకరాల్లో ఒక్క చెట్టు కూడా కొట్టకుండా ఆదేశాలివ్వాల్సి వస్తుందని తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఊరుకోమని జస్టిస్ గవాయి హెచ్చరించారు. భూముల మార్టిగేజ్‌తో తమకు సంబంధం లేదని.. చెట్ల నరికివేత గురించే తాము మాట్లాడుతున్నామని చెప్పారు. కంచ గచ్చిబౌలిలో అడవులు లేవని వాదిస్తే.. అదే ప్రాంతంలో జైలు కట్టి అందులోనే అధికారులను పెట్టాల్సి ఉంటుందని జస్టిస్ బీఆర్ గవాయి హెచ్చరించారు. చెట్లు కొట్టేసే ముందు అనుమతి ఉందా లేదా అన్నదే ముఖ్యమని తెలిపారు. అనుమతులు లేకుండా చెట్లు– కొట్టేసినందుకు సీఎస్ సహా అధికారులు జైలుకు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. సీఎస్‌ను కాపాడాలనుకుంటే.. వంద ఎకరాలను ఎలా పునరుద్ధిస్తారో చెప్పాలన్నారు. పునరుద్ధరణ ఎలా చేస్తారు? ఎంతకాలంలో చేస్తారు? జంతు జాలాన్ని ఎలా సంరక్షిస్తారో స్పష్టంగా చెప్పాలని ఆదేశించారు. దీనిపై నాలుగు వారాల్లో ప్రణాళిక ఫైల్ చేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణలో వాల్టా చట్టం అమలులో ఉందని, దాని ప్రకారం స్వయం అనుమతులుగా ప్రభుత్వం వ్యవహరించిందని అమికస్ క్యూరీ సుప్రీంకు వివరించారు. పర్యావరణాన్ని కాపాడటానికి మేము ఇక్కడ ఉన్నాం. అధికారుల అనుమతి లేకుండా ఎన్ని చెట్లను నరికివేశారో అనే ఆందోళన మాత్రమే ఉంది. చెట్లను ఎలా పునరుద్ధరిస్తారో చెప్పాలి. మేము బుల్డోజర్ ఉనికి, 100 ఎకరాల అడవిని తొలగించడం గురించి మాత్రమే ఆందోళన చెందుతున్నాం. మీరు నిర్మించాలనుకుంటే, మీరుఅనుమతులు తీసుకొని ఉండాలి అని జస్టిస్ అన్నారు. 2004 నుంచి ఈ భూముల వ్యవహారం, కోర్టుల్లో ఉన్న పరిస్థితి, తర్వాత చుట్టుపక్కల జరిగిన అభివృద్ధి, ఐటి పార్కు, ఇతర ప్రాజెక్టులకు సంబంధించిన వివారలను కోర్టుకు చెప్పారు. అయితే వంద ఎకరాల్లో జరిగిన నష్టాన్ని ఎలా పూడ్చాలన్న విషయం పైనే మేము దృష్టి సారించాలని అంటున్నామని జస్టిస్ గవాయ్ అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఏమైనా చేస్తాం.ఆ భూముల్లో ఉన్న జంతుజాలాన్ని ఎలా సంరక్షిస్తారో చెప్పాలన్నారు. ఆర్టికల్ 142 కింద పర్యావరణ పరిరక్షణ కోసం ఏమైనా చేస్తాం. పునరుద్ధరణను అడ్డుకునే ప్రయత్నం చేస్తే, మీ అధికారులను తాత్కాలికంగా జైలుకు పంపిస్తాం అని కఠినంగానే అన్నారు. 100 ఎకరాల్లో జరిగిన నష్టం కారణంగా ప్రభావితమైన వన్యప్రాణులను రక్షించేందుకు అవసరమైన తక్షణ చర్యలను పరిశీలించి, అమలులోకి తీసుకురావాలని తెలంగాణ వన్యప్రాణి సంరక్షణాధికారిని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. పునరుద్ధరణ ఎలా చేస్తారు, ఎంత కాలంలో చేస్తారు, జంతు జలాన్ని ఎలా సంరక్షిస్తారో స్పష్టంగా చెప్పాలని తెలంగాణ ప్రభుత్వాన్ని సుప్రీం ఆదేశించింది. నాలుగు వారాల్లో ప్రణాళిక ఫైల్ చేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది ధర్మాసనం. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో స్టేటస్ కో కొనసాగించాలని ఆదేశాల్లో పేర్కొంది. తదుపరి విచారణను మే 15కు సుప్రీం కోర్టు వాయిదా వేసింది.

## నేటి నుంచి భూభారతి అవగాహన సదస్సులు

(మొదటి పేజీ తరువాయి)

మహబూబ్‌నగర్ జిల్లాలోని మద్దూర్ మండలం ఖాజీపురంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాజెక్టు ప్రారంభించనున్నారు. అలాగే.. వికారాబాద్ జిల్లా పుడూరు గ్రామంలో జరిగే భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొననున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగనున్న భూ భారతి చట్టం అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, రెవెన్యూ అధికారులు పాల్గొననున్నారు. ఏప్రిల్ 17 నుంచి జూన్ 2 వరకు భూ భారతి చట్టం పై అవగాహన సదస్సులు నిర్వహించనుంది ప్రభుత్వం. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఒక ప్రతిష్టాత్మకమైన కార్యక్రమం ఇది. దీని ప్రయోజనం రాష్ట్రంలో భూ నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించడం , రైతులకు, పర్యావరణానికి అనుకూలంగా భూముల వినియోగాన్ని ప్రోత్సహించడం. ఈ కార్యక్రమం, తెలంగాణలో భూముల రిజిస్ట్రేషన్, భూమి చట్టాలు, ఆస్తి హక్కుల పునరుద్ధరణ వంటి ముఖ్యమైన అంశాలను కవర్ చేస్తుంది. భూ భారతి కార్యక్రమం ద్వారా, ప్రభుత్వమే భూముల ఖాతాలు, రికార్డులను సరికొత్తగా సృష్టించి వాటి మాలికల హక్కులను సులభంగా ప్రజలకు అందించేందుకు సహాయపడుతుంది. అంతేకాకుండా, ఇది రైతులకు భూములపై అనువైన పర్యవేక్షణను, కరెంట్ పొదుపు, పర్యావరణ పరిరక్షణ అంశాలు వంటి వాటిపై అవగాహన కూడా పెంచుతుంది.

# దేశాన్ని లూటీ చేసిన నెహ్రూ కుటుంబం

(మొదటి పేజీ తరువాయి)

కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ హయాంలో బొగ్గు, హెలికాప్టర్, బోఫోర్స్ కుంభకోణాలు లాంటివి ఎన్నో జరిగాయన్నారు. ఆ క్రమంలో జరిగిన మరో పెద్ద కుంభకోణమే నేషనల్ హెరాల్డ్ అని ఆయన పేర్కొన్నారు. స్వాతంత్య్ర సమరయోధులు నేషనల్ హెరాల్డ్ స్థాపిస్తే.. దానిని దొడ్డి దారిన సోనియా, రాహుల్ గాంధీలకు చెందిన రియల్ ఎస్టేట్ కంపెనీకి తరలించారని విమర్శించారు. ఈ వ్యవహారంపై దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ధర్నా చేయడం సిగ్గు మాలిన చర్య అని ఈ సందర్భంగా ఆయన అభివర్ణించారు. 2012లో నేషనల్ హెరాల్డ్ ఆస్తులపై దర్యాప్తు జరపాలంటూ సుబ్రమణ్య స్వామి పిటిషన్ వేశారన్నారు. అందులోభాగంగా సోనియాగాంధీ, రాహుల్ గాంధీలపై ఆయన కేసు వేశారని తెలిపారు . అయినా.. కాంగ్రెస్ పార్టీ ఎందుకు ధర్నాలు చేస్తుందని ఆయన సందేహం వ్యక్తం చేశారు. వీరికి భయపడి కేసులు వెనక్కి తీసుకోవాలా? అని పార్టీని సూటిగా ఆయన ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై దేశంలో అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సైతం దర్యాప్తు జరపాలని చెప్పిందని గుర్తు చేశారు. చేసిన తప్పులకు చెంపలు వేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలకు ఆయన సూచించారు. ప్రజలను తప్పుదారి పట్టించడంతోపాటు ఈడి కార్యాలయాల ముందు ధర్నా చేయడం మానుకోవాలని వారికి హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ చేసిన కుంభకోణాలను ప్రజలు ఇంకా మరిచిపోలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ధర్నా చేయడమంటే ప్రజాస్వామ్యాన్ని, సుప్రీంకోర్టు, హైకోర్టును తప్పుపట్టడమేనని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ కేసులు ఎందుకు వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులను ఆయన డిమాండ్ చేశారు. చట్టానికి వీరేమైనా చుట్టాలా అంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. ఎందుకు ధర్నా చేస్తున్నారంటూ మండిపడ్డారు. తప్పు జరగలేదని కాంగ్రెస్ పార్టీ భూకయిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కేసు కొట్టేయాలంటూ సుప్రీంకోర్టు,హైకోర్టు ఎందుకు వెళ్ళారని ఆయన ప్రశ్నించారు. ఇలా వెళ్లడం రాజ్యాంగబద్ధమైన సంస్థలను అవహేళన చేయడమేనని పేర్కొన్నారు. సోనియా, రాహుల్ గాంధీలు దేశం కోసం చేసిన పనులు కావన్నారు. వీరు బహిరంగ అవినీతికి పాల్పడ్డారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. మరోవైపు నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్ పేర్లను ఛార్జిషీట్‌లో ఈడీ పెట్టింది. ఈ కేసును ఏప్రిల్ 25వ తేదీన విచారణ జరపనున్నట్లు– ప్రత్యేక కోర్టు స్పష్టం చేసింది. అయితే ఇదే కేసులో ప్రియాంక గాంధీ భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాను ఈడీ ప్రశ్నించిన కొన్ని గంటలకే సోనియా, రాహుల్ గాంధీ పేర్లను ఛార్జిషీట్‌లో ఈడీ చేర్చడం గమనార్హం.

# గాంధీ కుటుంబంపై బీజేపీ కక్షసాధింపు ధోరణి నశించాలి

(మొదటి పేజీ తరువాయి)




అంబేద్కర్ చౌరస్తా వద్ద స్వయంగా కింద కూర్చొని నిరసనలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని మాట్లాడుతూ గుజరాత్ లో జరిగిన ఎఐసిసి ప్లీనరీ సమావేశం తరువాత బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడుతుంటే కాంగ్రెస్ అగ్రనేతలను ఈడి కేసుల పేరుతో వేధింపులు చేస్తూ ఇబ్బందులు పెడుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల కోసం పోరాడుతూ పెరుగుదల చూసి ఓర్వలేక అది నాయకత్వాన్ని ఈడి కేసుల పేరుతో చార్జిషీట్ ల పేరుతో ఇబ్బందులు పేడుతుందన్నారు. నేషనల్ హెరాల్డ్ పత్రిక దేశ స్వతంత్ర్యం కోసం పని చేసిందన్నారు. దేశంలో గాంధీ కుటుంబమే ఆస్తులను సంపాదించాలని అనుకుంటే వందల మంది ముఖ్యమంత్రులను కేంద్ర మంత్రులను చేసింది వాళ్ళు అవినీతికి పాల్పడకపోయేదా అని ప్రశ్నించారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన గాంధీ కుటుంబాన్ని బధనామ్ చేస్తున్నారని మండి పడ్డారు. 85 సంవత్సరాలు ఉన్న సోనియా గాంధీనీ కూడా విచారణ పేరుతో ఇబ్బంది పేడుతు రాక్షస్వతంతో వ్యవహరిస్తున్నారన్నారు. తనేషాహి నై చెలెగి నరేంద్ర మోదీ తనేషాహి అని దేశం మొత్తం గాంధీ కుటుంబానికి సానుభూతి తెలుపుతుందన్నారు.దేశం కోసం ప్రాణాలు అర్పించి రాజ్యాంగాన్ని రక్షించాలని నరేంద్ర మోడీ ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలని పార్లమెంట్ లో మాట్లాడుతుంటే అహ్మదాబాద్ సభతో బిజెపి ఎక్కడ దెబ్బతింటుందో కాంగ్రెస్ ఎక్కడ పెరుగుతుందో అని అధైర్యపరాచడానికి వేధింపులకు గురి చేస్తున్నారు. హుస్నాబాద్ వేదికగా బిజెపిని డిమాండ్ చేస్తున్నా, గాంధీ కుటుంబం అవినీతికి పాల్పడితే జైల్లో పెట్టండి కానీ కాంగ్రెస్ బలపడుతుందన్నప్పుడు ఇలా ఈడి కేసులతో ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. దేశంలో అనేక మంది నిరవ్ మోదీలు దేశాన్ని దోచుకుంటే చర్యలు లేవన్నారు. దేశం మొత్తం ప్రభుత్వ రంగ సంస్థలు ఎల్ఐసీ, ఎయిర్పోర్ట్, పోర్టులు, రైల్వేలు అన్ని ఆర్థిక సంస్థలు అదానీ, అంబానీలకు అప్పగిస్తున్నారన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన నెహ్రూ కుటుంబం ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ వారసులను సోనియా గాంధీ రాహుల్ గాంధీలను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. దేశంలో ఉన్న ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, ప్రతి పౌరుడు దేశ అభివృద్ధి కోరుకునే అందరూ ఈ వేధింపులు ఖండిస్తున్నారన్నారు. సోనియా గాంధీ రాహుల్ గాంధీ అధైర్య పడవద్దని వారిని మీ వెంట మేమున్నామని దేశమంతా ముక్తకంఠంతో మద్దతిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ ధర్నా చేపట్టిందన్నారు. ఈడి లాంటి సంస్థలను బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్షాలను వేధింపులకు కక్ష సాధింపులకే వాడుతుందన్నారు. రాహుల్ గాంధీ సోనియా గాంధీ లను హుస్నాబాద్ కాంగ్రెస్ అండగా ఉందన్నారు. గాంధీ కుటుంబంపై బీజేపీ నరేంద్ర మోదీ కక్ష సాధింపులను ఖండిస్తున్నాం అన్నారు.

# వరుసగా రెండోరోజూ ఈడి విచారణకు వాద్రా

(మొదటి పేజీ తరువాయి)



చక్కర్లు కొడు తున్నాయి. ప్రస్తుతం వాద్రాను అధికారులు విచారి స్తున్నారు. ప్రియాంక కార్యాలయంలోని వెయిటింగ్ రూమ్‌లో ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా.. విచారణకు హాజరయ్యే సమయంలో వాద్రా ఓ వార్తాసంస్థతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఇది చాలా దురదృ ష్టకరం. ప్రభుత్వ తప్పిదాలను బయటకు చెప్పేవారిపై ఈడీతో సహా ఇతర ఏజెన్సీలు దాడులు చేస్తున్నాయి. దీన్ని దేశంలోని ప్రతిఒక్కరూ గమనిస్తున్నారు. ఈ ఏజెన్సీలపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతోంది. అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టి మరల్చేం దుకే ఇలా చేస్తున్నారు. నాపై చేస్తున్న తప్పుడు ఆరోపణలకు వ్యతిరేకంగా నేను పోరాటం చేస్తున్నా. అందుకే ఇది జరిగింది. ప్రజలు నాతో ఉన్నారు. వారు నన్ను రాజకీయాల్లో చూడాలను కుంటున్నారని వాద్రా పేర్కొన్నారు. ఈడీ ప్రకారం.. వాద్రా కంపెనీ 2008 ఫిబ్రవరిలో గుర్గావ్‌లోని షికోపూర్‌లో 3.5 ఎకరాల స్థలాన్ని ఓంకారేశ్వర్ ప్రాపర్టీ నుంచి కొనుగోలు చేసింది. దీని విలువ రూ.7.5 కోట్లు–. ఆ తర్వాత వాద్రా కంపెనీ ఆ భూమిని రియల్ ఎస్టేట్ కంపెనీ అయిన డీఎల్ఎఫ్‌కు రూ.58 కోట్లకు విక్రయించింది. డీఎల్ఎఫ్‌కు రూ.58 కోట్ల భారీ లాభంతో విక్రయించడంతో మనీలాండరింగ్ ఆరోపణలు వచ్చాయి. ఈనేపథ్యంలో ఈడీ విచారణ జరుపుతోంది.

# గాలి వాన బీభత్సానికి నేలకొరిగిన వరి పంట

**● ప్రభుత్వం తమని ఆదుకోవాలని వేడుకోలు**





**తొలి అక్షరం/చెన్నారావుపేట ఏప్రిల్ 16:** చెన్నారావుపేట మండల కేంద్రంలో ని లింగగిరి గ్రామంలో రైతులు రేయనక పగలనక కంటికి పాపాలా కాపాడుకున్న పొలము ఇక కొద్దిరోజుల్లో చేతికి వస్తుందని అనుకునే లోపే అన్నదాతను అకాల వర్షం గాలివాన బీభత్సం రెండూ కలిసి ఆగం చేశాయి.అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గత రాత్రి చెన్నారావుపేట మండల కేంద్రంలోని లింగగిరి గ్రామంలో దాసరి రమేష్,మాదారపు స్వామి, ఇసంపల్లి వీరన్న,పసునూరి బాబు, ఇసంపల్లి యాకయ్య, జంగిలి చినరాజు.ల చేతికి అంది వచ్చిన వరి పొలాలు నేలమట్టమై రైతన్నల నోట్లో మట్టి కొట్టినంత పని చేశాయి. అని ఇక కొద్ది రోజుల్లో కోత దశలో ఉన్న పంట పొలం ఒక్కసారిగా గాలి వానకి నేలమట్టం అవడంతో రైతన్నలు బోరున విలపిస్తున్నారు ఆరుగాలను కష్టపడి అప్పులు చేసి పెట్టుబడి పెట్టినటువంటి పంట పొలాలను అకాల వర్షం ఆగం చేసి అప్పుల పాలు చేసిందని తమ గోడును విన్నవిస్తూ బోరుణ విలపిస్తున్నారు.అయితే దీని స్థితిలో ఉన్నటువంటి ఆ రైతులు కన్నీరు మున్నీరుగా విలపిస్తూ.. ప్రభుత్వం తమని ఆదుకోవాలని వారు ప్రభుత్వానికి తమ బాధను విన్నవించుకుంటున్నారు.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని సమ్మయ్యకు సన్మానం

**● నేరేడు పండ్ల మొక్కను నాటిన వన ప్రేమికుడు సమ్మయ్య**




**తొలి అక్షరం/నెక్కొండ ఏప్రిల్ 16:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు ఈదునూరి యాకోబు వారి ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక నాయకులు కనకం రాజేంద్రప్రసాద్ వారి కోరిక మేరకు నెక్కొండ గెస్ట్ హౌస్ లో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ అవార్డు గ్రహీత వన ప్రేమికుడు సమ్మయ్య నేరేడు పండ్ల మొక్క నాటడం జరిగింది. ఈ సందర్భంగా వన ప్రేమికుడు సమ్మయ్య మాట్లాడుతూ మానవాళి పశుపక్షాదులకు చెట్లే మూలాధారం కాలుష్యం నివారించడానికి పర్యావరణం పరిరక్షణ కొరకు మొక్కలు నాటుతున్నందుకు,ఈ మొక్కలు వటవృక్షాలు కావాలని భగవంతుని వేడుకున్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు యాజమాన్యం నా సామాజిక సేవలు గుర్తించి శాలువతో సత్కరించి నందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. భారత రాజ్యాంగ సృష్టికర్త భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆ మహనీయునికి వన ప్రేమికుడు సమ్మయ్య జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ఈదునూరి వెంకన్న మాజీ సర్పంచ్ మారంపల్లి కొమ్మాలు డాక్టర్ ఈదునూరి వెంకటేశ్వర్లు మాంకాల యాదగిరి కందిక చెన్నకేశవులు ఈదునూరి యాకయ్య ఈదునూరి ప్రభాకర్ తెలంగాణ శ్రీనివాస్ విజయ్ వడ్లకొండ వెంకన్న పాల్గొన్నారు.

# బీదర్ టు మానుకోట నల్లబెల్లం అక్రమ రవాణా..

**● 48 బస్తాల నల్ల బెల్లం.. రెండు బస్తాల పట్టిక..**

**● గుడుంబా అమ్మిన తయారుచేసిన పీడియాక్టు: ఎస్ఐ చిర్రరమేష్ బాబు..**



**తొలి అక్షరం/నెల్లికుదురు. ఏప్రిల్ 16:** గుడుంబా తయారీకి వినియోగించే నిషేధిత నల్ల బెల్లం పట్టికను బొలెరో వాహనంలో అక్రమంగా తెస్తుండగా పోలీసు వాహనాలు తనిఖీలో బుధవారం మండల కేంద్రంలో పట్టుకున్నారు. నెల్లికుదురు ఎస్సై చిర్ర రమేష్ బాబు కథనం ప్రకారం కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ నుంచి మహబూబాబాద్ జిల్లా చుట్టుపక్కల ప్రాంతంలో కుటుంబా తయారీకి వినియోగించే నిషేధిత 48 బస్తాల నల్లబెల్లం, రెండు బస్తాల పట్టికను కర్ణాటక రాష్ట్రం బీదర్ నుండి మహబూబాబాద్ జిల్లా చుట్టుపక్కల ప్రాంతంలో గుడుంబా తయారీకి వినియోగించే నిషేధిత నల్లబెల్లం పట్టికను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అమ్మ దగ్గర సమాచారం మీకు ఒక బులోరా వాహనమును రామకృష్ణ ఎక్స్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీలో పట్టుకోవడం జరిగిందన్నారు. కేసముద్రం మండలం గాంధీనగరం గాంధీ నగరం తండాకు చెందిన బాదావత్ సురేష్, మహబూబాబాద్ మండల వేమునూరు రాయకుంట తండాకు చెందిన భూక్య చందు, ఇనుగుర్తి మండలం కోమటిపల్లికి చెందిన సపావటు సంతోష్,కురవి మండలం జగ్య తండా కు చెందిన కేలోత్ హరిసింగ్ కలిసి బీదర్ నుంచి అక్రమంగా నల్ల బెల్లం పట్టిను రవాణా చేస్తు న్నారని, రెండు లక్షల 50వేల విలువైన నల్ల బెల్లం పట్టికను బొలోరో వాహనాన్ని స్వాధీనం పరుచుకుని నలుగురి వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగిందని వివరించారు. నిషేధిత నల్ల బెల్లం పట్టిక గంజాయి లాంటి మార్గ ద్రవ్యాలను రవాణా చేసిన అమ్మిన అట్టి వారిపై కఠిన చర్య తీసుకొని పీడీ యాక్ట్ నమోదు చేయడం జరుగుతుందని ఎస్ఐ రమేష్ బాబు వివరించారు.

# అకాల వర్షానికి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

**● కుర్చీలకు పరిమితమైన వ్యవసాయ అధికారులను సస్పెండ్ చేయాలి**

**● సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పరికి మధుకర్**




**తొలి అక్షరం/చెన్నారావుపేట ఏప్రిల్ 14:** చెన్నరావుపేట మండలం ఉప్పరపల్లి గ్రామంలో అకాల వర్షానికి నీలమట్టమైన వరినీ, తడిసిన మొక్కజొన్నలను సిపిఎం ఆధ్వర్యంలో వారు పరిశీలించారు, అనంతరం నిర్వహించిన సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పరికి మధుకర్ మాట్లాడుతూ ఆరు కాలం కష్టపడి పంట చేతికొచ్చే క్రమంలో అకాలవర్షం పడడంతో రైతుకు కన్నీరే మిగులుతున్నాయని ఆవేదన చెందారు, ప్రభుత్వం రైతులకు జరిగిన నష్టాన్ని అంచనవేసి నష్టపరిహారం అందించడంలో విఫలమైందని ఆయన అన్నారు,ఎల్లవేళలా రైతుల యొక్క కష్టాలను, సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లే వ్యవసాయ అధికారులు కుర్చీలకే పరిమితమై చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు, కుర్చీలకే పరిమితమవుతున్న వ్యవసాయ అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు, మొక్కజొన్నలకు 3000 రూపాయలు గిట్టుబాటు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు, ప్రభుత్వం తక్షణమే పంట నష్టాన్ని అంచనావేసి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు,ఈ కార్యక్రమం లో సిపిఎం నాయకులు పెరుమాండ్ల అమరేందర్ రెడ్డి, కుక్కల రాజు,రైతులు ఎండి భాషమీయ,లంకలపల్లి రాజాలు,రాములు,దొనకొండ భూపాల్ రెడ్డి,పప్పు శ్రీపాల్, కుక్కల రాజు,అందే వీరేశం, మోర శంకర్,గుల్లపల్లి బాబు,కుక్కల కట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# కీ,శే,గోగుల జయశ్రీ జ్ఞాపకార్ధంగా రిఫ్రిజిరేటర్ బహుకరించిన కుటుంబ సభ్యులు

**● నర్సంపేట ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో ప్రారంభించిన గోగుల రాణా ప్రతాపరెడ్డి**




**తొలి అక్షరం/నర్సంపేట ఏప్రిల్ 16:** నర్సంపేట పట్టణ కేంద్రంలోని స్థానిక ఆర్.టీ.సి బస్టాండ్ లో నూతన త్రాగునీటి రిఫ్రిజిరేటర్ ను కీర్తిశేషులు గొగుల జయశ్రీ జ్ఞాపకార్ధంగా తాగునీటి రిఫ్రిజిరేటర్ ను బహుకరించి ప్రారంభించిన డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి.ఇటీవలే మరణించిన తన తల్లి జ్ఞాపకార్ధంగా నర్సంపేట పట్టణంలోని ఆర్.టీ.సి బస్టాండ్ లో ప్రయాణికుల సౌకర్యార్థం.నూతన త్రాగునీటి రిఫ్రిజిరేటర్ ను కుటుంబ సభ్యుల ఆర్.టీ.సి,డి ఎం.కే.ప్రసన్న లక్ష్మి సమక్షంలో నూతన త్రాగునీటి రిఫ్రిజిరేటర్ ను ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ...మంచి నీరు సౌకర్యం అనేది ప్రతి ఒక్కరు. ప్రయాణికులు వారి అవసరం మేరకు దీనిని వినియోగించు కోవాలని వారి కుటుంబ సభ్యులు తెలియజేశారు. అనంతరం ఆర్టీసీ డి.ఎం.లక్ష్మి ప్రసన్న గోగుల రాణా ప్రతాపరెడ్డి కుటుంబ సభ్యులకు ఆర్టీసీ నర్సంపేట డిపో తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# మాజీ కౌన్సిలర్స్ మాధురి నందకిశోర్, వెంకట్ రామ్ రెడ్డిలకు జన్మదిన శుభాకాంక్షలు

**● శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్సి నాగరకుంట నవీన్ రెడ్డి**

**● మాజీ కౌన్సిలర్, బిఆర్ఎస్ నాయకులు ఈశ్వర్ రాజు, బీఎస్ సుధీర్ తదితరులు**



**తొలి అక్షరం/షాద్ నగర్, ఏప్రిల్ 16:** రంగారెడ్డి జిల్లా,షాద్ నగర్ పట్టణ మాజీ కౌన్సిలర్స్ మాధురి నందకిశోర్, వెంకట్ రామ్ రెడ్డిల జన్మదిన సందర్భంగా వారిని శాలువాతో సత్కరించి ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని ఎమ్మెల్సి నాగరకుంట నవీన్ రెడ్డి వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేశారు. అలాగే కౌన్సిలర్ ఈశ్వర్ రాజు, బీఆర్ఎస్ నాయకుడు బీఎస్ సుధీర్,దినేష్ సాగర్ శాలువాతో సత్కారించి జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ కార్యక్రమం లో బాల్ రెడ్డి బాలశవ్ రెడ్డి, అశోక్, గౌరీ శంకర్, కూనరవి, శివా చారి, కాటా సుధీర్, మధు, అన్వారీ రాజు, గుట్ట రాజు పి.యన్ గౌడ్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.





# ఈదురుగాలులకు నష్టపోయిన మామిడి తోటలను పరిశీలించిన ఉద్యాన శాఖ అధికారి శాంతి ప్రియ దర్శిని

**తొలి అక్షరం/దంతాలపల్లి ఏప్రిల్ 16:** బుధవారం రోజు దంతాలపల్లిలోని రేపోణి, వేములపల్లి,రామానుజపురం, పెద్ద ముప్పారం, రామవరం గ్రామాలలో ఉద్యాన శాఖ అధికారి శాంతి ప్రియ దర్శిని పర్యటించి నిన్న వచ్చిన ఈదురుగాలుల వల్ల రాలిన మామిడి తోటలను పరిశీలించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ దీక్షిత్, రైతులు కూడా ఉన్నారు.

# దిగిచర్ల స్వాతి- ప్రవీణ్‌లను పరామర్శించిన పిసిసి సభ్యులు సొంటి రెడ్డి



**తొలి అక్షరం/నెక్కొండ ఏప్రిల్16:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని రెడ్లవాడ గ్రామానికి చెందిన దిగిజర్ల ప్రవీణ్- స్వాతి ల పెద్ద కుమారుడు దిగిజర్ల పునీత్ రాణా, ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన పీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్, జిల్లా ఎస్టి సెల్ ఉపాధ్యక్షుడు లావుడియా తిరుమల్,కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఆవుల శ్రీనివాస్,కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి గడిదాస్ వేణుగోపాల్,సీనియర్ నాయకులు మూల భద్రయ్య,మాజీ ఎంపీటీసీ గొలుసు రమేష్,మాజీ ఉప సర్పంచ్ బర్ల వీరభద్రయ్య,మార్కెట్ డైరెక్టర్ రావుల మైపాల్ రెడ్డి, గుండబోయిన కవిత,తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన పీసీసీ సభ్యులు రంజిత్ రెడ్డి



**తొలి అక్షరం/నెక్కొండ , ఏప్రిల్ 16:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని సీతారాంపురం గ్రామ కాంగ్రెస్ నాయకుడు కంచరదాసు ఆనందరాజు కుమార్తె ప్రత్యూష- శ్రీకాంత్ వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన పీసీసీ సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్, జిల్లా ఎస్టి సెల్ ఉపాధ్యక్షుడు లావుడియా తిరుమల్, మార్కెట్ డైరెక్టర్ రావుల మైపాల్ రెడ్డి, సీతారాంపురం కాంగ్రెస్ నాయకులు జక్కుల రాజు, కోల వెంకన్న,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# నెక్కొండ మోడల్ స్కూల్‌ను సందర్శించిన ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి

**తొలి అక్షరం/నెక్కొండ ఏప్రిల్ 16:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని నెక్కొండ మోడల్ స్కూల్ కు విచ్చేసిన ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి కిమోడల్ స్కూల్ అధ్యాపక బృందం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా గౌరవ ఎమ్మెల్సీ మాట్లాడుతూ మోడల్ స్కూల్ అధ్యాపకుల సమస్యల పరిష్కారం కొరకు కృషి చేస్తానని, వారికి 010 ద్వారా వేతనం అందేలా మరియు హెల్త్ కార్డ్స్ వచ్చేలా కృషి చేస్తానని, తెలియజేశారు. అదేవిధంగా నా విజయంలో కీలక పాత్ర వహించిన మోడల్ స్కూల్ అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ప్రణయకుమార్ , స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ ఆర్.యాకయ్య , శ్రీధర్ రెడ్డి, మండల అధ్యక్షుడు ప్రతాప్ సింగ్, ప్రధాన కార్యదర్శి యాకుబ్ రెడ్డి, స్టేట్ సెక్రటరీ జి, శేఖర్ మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



## అగ్ని వీర్ (ఆర్మీ)లో లోకిని ధనుష్‌కు సన్మానం

**- ఛాంపియన్స్ లీగ్ క్రికెట్ ఆర్గనైజర్స్, క్రీడాకారులు**




**తొలి అక్షరం/కోరుట్ల ఏప్రిల్ 16:** పట్టణంలోని ఏకలవ్య నగర్‌కు చెందిన లోకిని ధనుష్ అగ్నివీర్ ( ఆర్మీ) లో ఉ ద్యోగం సాధించగా ఆయనను బుధవా రం పట్టణం లోని మినీ అంబేద్కర్ స్టేడి యంలో ఆర్గనైజర్ ఇర్ఫాన్( మాల్సాబ్), ఆల్ రౌండర్ గంగాధర్(ట్రైనర్)విక్రమా దిత్య,బొంబాయి అనిల్, నవీన్,మూర్తి క్రికెట్ కారులందరూ ఘనంగా సన్మానించారు.అనంతరం వారు మాట్లాడుతూ ధనుష్ దేశానికి సేవ చేసే ఉద్యోగం పొం దడం ఆనందంగా ఉందన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**తొలి అక్షరం/వనపర్తి :**పెద్దమందడి మండలం అమ్మపల్లి గ్రామంలో బుధవారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మహిళా సమైక్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వారి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, మాజీ జెడ్పిటిసిలు వెంకటస్వామి, రమేష్ గౌడ్, మాజీ సర్పంచులు, రమేష్ యాదవ్, శ్రీనివాసరెడ్డి, బాల్ చంద్రయ్య, సాక వెంకటయ్య, మాజీ ఎంపీటీసీలు రామచంద్రయ్య గౌడ్, సత్య రెడ్డి, అమ్మపల్లి వెంకటేశ్వర రెడ్డి, గట్టు యాదవ్, బాలు, మహిళా సమాఖ్య అధికారులు సిబ్బంది కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**తొలి అక్షరం/మంథని:ఏప్రిల్ 16:** మంథని మండలం ఎక్లాస్ పూర్ గ్రామంలో బుధవారం రోజున పల్లె వెలుగు గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఏడిఏ అంజని,డిప్యూటీ తహసిల్దార్ సిరిపురం గిరీ,ఏఈఓ మురళి మంథని డివిజన్ ఎస్సిసెల్ అధ్యక్షులు మంథని సత్యం,మహిళా సంఘం వీఓ గుడిమల్ల వసంత,గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు..

## వైద్య కళాశాలకు దేహదానం

**తొలి అక్షరం/సుల్తానాబాద్: ఏప్రిల్ 16:** సుల్తానాబాద్ లయన్స్ క్లబ్,సదాశయ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఓదెల మండలం కొలనూరు గ్రామానికి చెందిన వయసు 95 సం గల జీగురు ఓదెలు వృద్ధాప్యం తో మరణించగా అతని కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా మృతదేహాన్ని నగునూరు ప్రతిమ వైద్య కళాశాలకు దేహ దానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో సదాశయ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ప్రతినిదులు మాట్లాడుతూ.. శరీరం మట్టిలో వృధాగా కలవకుండా సమాజ హితంతోపాటు వైద్య విద్యార్థుల పరిశోధనల నిమిత్తం మృతదేహాన్ని వైద్య కళాశాలకు స్వచ్ఛందంగా అందజేయడానికి ముందుకు వచ్చిన మృతుని కుటుంబ సభ్యులను అభినందించి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వైద్య కళాశాల ప్రతినిధులు మృతదేహం స్వీకరణ ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు మాటేటి సంజీవ్ కుమార్, జిల్లా చీఫ్ కో-ఆర్డినేటర్లు వలస నీలయ్య, మాటేటి శ్రీనివాస్, కోశాధికారి పూసాల సాంబమూర్తి, సదాశయ ఫౌండేషన్ అధ్యక్షులు శ్రవణ్ కుమార్, ప్రతినిధులు భీష్మ చారి, క్యాతం మల్లేశంతో పాటు ఆసుపత్రి కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# మండల కేంద్రంలో ప్రారంభం కాని ధాన్యం కొనుగోలు కేంద్రం

- కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలి
- కేంద్రాలలో తడిసిన వడ్లు
- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు అధికారులు
- ఎమ్మెల్యే స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించాలని రైతులు డిమాండ్










**తొలి అక్షరం/నరసింహుల పేట ఏప్రిల్ 16:** మండలం కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం కాలేదని మండల ప్రజలు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు వరికోతలు ముగించిన రైతులు ధాన్యం ఎక్కడ విక్రయించాలో తెలియక ఇబ్బందిపడుతున్నారు. ధాన్యాన్ని రైతులు పొద్దంతా కాపలాకాస్తున్నారు. **- ప్రారంభం కాని ధాన్యం కొనుగోలు కేంద్రాలు... - కొనుగోలు కేంద్రం ప్రారంభించే స్థలంలో రైతులు పోసిన కాలయాపన చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు...** రైతులు పండించిన ధాన్యం మధ్య దళారులకు అమ్మి నష్టపోవద్దని, వారికి ప్రభుత్వం మద్దతు ధరను కల్పించేందుకు రైతులకు అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కానీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు వివక్ష చూపుతున్నారని, ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు వరి ధాన్యపు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడానికి కావాల్సిన అన్ని వసతి సౌకర్యాలను సమకూర్చారు. కానీ మూడు రోజుల గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో వారం రోజుల క్రితమే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. కానీ మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మాత్రం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక పోవడంతో ఆయా గ్రామాల రైతులు అధికారులు, ప్రజాప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం మాదిరిగానే ఈసారికూడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారనే నమ్మకంతోనే ధాన్యాన్ని తీసుకొచ్చి 15 అయినారైతులు పేర్కొంటున్నారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని, ఎవరూ అధైర్యపడొద్దని ఓ వైపు అధికారులు, ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నప్పటికీ తమకు మాత్రం భరోసా లేకుండా పోయిందంటున్నారు పలువురు రైతులు. వరి కోతలు అయిపోయాయి. ధాన్యాన్ని కల్లాల వద్దే ఉంచామని వర్షాలు పడితే ధాన్యం తడిసి ముద్దయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రంప్రారంభించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.అకాల వర్షాలతో నిన్న రాత్రి కృష్ణ వర్షాలకు వడ్లు తడిసి ముద్ద అయ్యాయికానీ అధికారులు ప్రజాప్రతినిధులు ఎందుకు స్పందిస్తలేదు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు కొనుగోలు కేంద్రంలో సుమారు 80 మంది రైతులు వడ్లు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్నాయి కానీ రైతులకు పట్టాలు ఇవ్వలేదని రైతులు తెలిపారు మండల కేంద్రంలో గత 15 రోజులు నుండి వడ్లు పోశారు రైతులు కానీ ఇంతవరకు మండల కేంద్రంలో వరి ధాన్యం కేంద్రం ప్రారంభించ లేదని రైతుల ఆవేదన వ్యక్తం చేశారు మండల కేంద్రంలో ఐదు లారీల ఒడ్లు ఇప్పటికి నిల్వ ఉన్నాయని రైతులు చెబుతున్నారు ఎమ్మెల్యే స్పందించి రైతులను ఆదుకొని త్వరగా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని మండల రైతులు కోరుతున్నారు **రైతుల మా కోస ఎవరికీ చెప్పుకోవాలి.** గ్రామంలో ధాన్యపు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని చెప్పారు. అందుకే తాను కొనుగోలు కేంద్రానికి ఐదు రోజుల క్రితమే ధాన్యాన్ని తీసుకొచ్చాను. కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయక పోవడంతో ఇబ్బందులు పడుతున్నాను. రోజు సాయంత్రం కాగానే ఆకాశం మబ్బులతో కమ్ముకొవడంతో ఆందోళనకు గరుయగుతున్నట్టు తెలిపారు. పిఎసిఎస్ చైర్మన్ వివరణ అడగగా సంపేట రాము మాట్లాడు కొనుగోలు కేంద్రాన్ని త్వరలో ప్రారంభిస్తామని ఆయన తెలిపారు వచ్చే ఆదివారం ప్రారంభిస్తామని ఆయన తెలిపారు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పట్టాలు ఇస్తామని ఆదుకుంటామని ఆయన అన్నారు

## సకల విఘ్నాలను తొలగించే విఘ్న వినాయక... మమ్మల్ని చల్లంగా చూడవయ్యా స్వామి

- సంకటహర చతుర్థి పురస్కరించుకొని శ్రీ శివ మారుతి గీతా అయ్యప్ప దేవాలయంలో ప్రత్యేక పూజలు
- ప్రత్యేక పూజలు నిర్వహించిన శ్రీ వినాయక సేవా సమితి



**తొలి అక్షరం/షాద్ నగర్, ఏప్రిల్ 16:** సకల విఘ్నాలను తొలగించే విఘ్న వినాయక... మమ్మల్ని చల్లంగా చూడవయ్యా స్వామి అంటూ షాద్ నగర్ పట్టణంలోని స్థానిక శివ మారుతి దేవాలయంలో వినాయకునికి సంకటహర చతుర్థి పురస్కరించుకుని శ్రీ వినాయక సేవా సమితి అధ్యక్షుడు ఒగ్గు శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో శ్రీ శివ మారుతి గీతా అయ్యప్ప మందిరంలో ఆలయ పురోహితుడు సంతోష్ శాస్త్రి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. సంకటహర చతుర్థి అనేది ప్రతిమాసం కృష్ణపక్షంలో నాలుగవ రోజు వచ్చే చవితి. ఈరోజు గణపతికి పూజలు చేసిన వారికి ఎలాంటి కష్టం అయినా హరించే రోజుగా చెప్పబడింది. ఈరోజు చాలామంది భక్తులు ఉపవాసముండి సంకట హర చతుర్థ గణేశ పూజ జరిపి చంద్ర దర్శనం జరిగిన తర్వాత వారి ఉపవాస దీక్షను విరమిస్తారు. ఈ కార్యక్రమంలో వినాయక సేవా సమితి అధ్యక్షుడు ఒగ్గు శ్రీకాంత్ గౌడ్ గడ్డం అంజనేయులు, గంతల నాగరాజు, శివ మారుతి గీతా మందిర దేవస్థాన కమిటీ అధ్యక్షుడు లష్కర్ ఆంజనేయులు, రేణుకుంట్ల కైలాష్ నాథ్, రేణికుంట్ల ప్రసాద్,రాజ్ గోపాల్, భార్గవి జనరల్ స్టోర్ శివ, ప్యాట శేఖర్, శ్రీకాంత్ తదితర భక్తులు పాల్గొన్నారు.

## అంగన్ వాడీల్లో పోషణ పక్షం

- కార్యక్రమానికి హాజరైన ఐసిడిఓ షబానా, సూపర్వైజర్ విజయలక్ష్మి

**తొలి అక్షరం/షాద్ నగర్,ఏప్రిల్ 15:** రంగారెడ్డి జిల్లా,ఫరూక్ నగర్ మండలంలోని లింగారెడ్డి గూడా అంగన్వాడి 2 కేంద్రంలో పోషక పక్షం లో భాగంగా అమృత అంగన్వాడీ టీచర్ ఆధ్వర్యంలో పోషక ఆహారంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. దీనిలో భాగంగా గర్భవతులు బాలింతలు తల్లులకు 1000 రోజుల ప్రాముఖ్యత లబ్ధిదారుల మాడ్యూల్ గురించి పోషక ఆహార లోపం ఉన్న పిల్లలు ఉబకాయంపై అవగాహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సి.డి.పి.ఓ షబానా, సూపర్వైజర్ జయలక్ష్మి, గ్రామ పంచాయతీ కార్యదర్శి అర్జున్ కుమార్, ఏ.ఎన్.ఎమ్.నిర్మల ఆశ కార్యకర్తలు గ్రేస్ సరళ మహిళా సంఘం అధ్యక్షులు జి. మాధవి,బి. మంగమ్మ , మహిళా సంఘం సభ్యులు మరియు అంగన్వాడీ ఆయా కృష్ణమ్మ పాల్గొనడం తదితరులు జరిగింది.



## బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ కమీషనర్‌ను కలిసిన మొగలిగిద్ద గ్రామస్తులు

- సమస్యలు విన్నవిస్తూ తీర్చాలంటూ విజ్ఞప్తి
- కమిషనర్‌ను కలిసిన మొగలిగిద్ద జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మంజుల, శ్యాంసుందర్, ర్యాకల మల్లేష్




**తొలి అక్షరం/ఫరూక్ నగర్, ఏప్రిల్ 16:** మొగిలిగిద్ద గ్రామంలో గత 25 సంవత్సరాలుగా నిర్వహింపబడుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని సమస్యలను ఈరోజు మొగిలిగిద్ద గ్రామస్తులు శ్యాంసుందర్, ర్యాకల మల్లేష్, మొగిలిగిద్ద జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మంజుల తో సహా బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ కమీషనర్ శ్రీ కృష్ణ ఆదిత్య, ఆర్ జె డి జయప్రద బాయి లను కలిసి తమ సమస్యలను విన్నవించుకుని తీర్చాలని విజ్ఞప్తి చేశారు. గత 25 సంవత్సరాలుగా మొగిలిగిద్ద గ్రామంలో జూనియర్ కళాశాల నిర్వహిస్తున్నప్పటికీ ఇప్పుడు కళాశాలలో స్వీపర్ మరియు అటెండర్ లేని పరిస్థితి ఉన్న కారణంగా స్వీపర్ ను అటెండర్ ను ఏర్పాటు చేయాలని కమీషనర్ శ్రీకృష్ణ ఆదిత్య కు విన్నవించుకోగా కాలేజీ తిరిగి పునః ప్రారంభం అయ్యేవరకు స్వీపర్ ను అటెండర్ ను ఖచ్చితంగా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అలాగే జూనియర్ కళాశాలకు సంబంధించిన భవనము పూర్తిగా పాతబడిపోయినందువలన భవన నిర్మాణానికి సంబంధించిన 50 లక్షల రూపాయలు ఇప్పటికే ప్రభుత్వం శాంక్షన్ చేసిందని, నూతన భవన నిర్మాణానికి సంబంధించిన పనులను కూడా త్వరలోనే ప్రారంభం చేయిస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు. బోట్ ఆఫ్ ఇంటర్మీడియట్ కమీషనర్ శ్రీకృష్ణ ఆదిత్యను కలిసిన వారిలో మొగలిగిద్ద జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మంజుల, శ్యాంసుందర్, ర్యాకల మల్లేష్ తదితరులు ఉన్నారు.





# చిత్రసీమలో ఎఐ వినియోగం

**- త్వరలోపే కంపెనీ ప్రారంభించనున్న దిల్‌రాజు**


టాలీవుడ్ అగ్ర నిర్మాతల్లో ఒకరైన దిల్ రాజు సినీ రంగంలో మరో వినూత్న ప్రయాణాన్ని ప్రారంభించ బోతున్నాడు. క్వాం టం ఏఐ గ్లోబల్‌తో కలిసి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత మీడియా కంపెనీని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ఈ కొత్త వెంచర్ ద్వారా సినీ రంగంలో అత్యాధునిక ఏఐ సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చే లక్ష్యంతో మే 4న కంపెనీ పేరు సహా పూర్తి వివరాలను వెల్లడించనున్నారు. ఈ ప్రకటనను దిల్ రాజు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ అధికారికంగా విడుదల చేసింది, ఈ సందర్భంగా ఓ వీడియోను కూడా షేర్ చేశారు. ఈ కొత్త కంపెనీ వినోద రంగానికి ప్రత్యేకంగా రూపొందించిన అధునాతన ఏఐ సాధనాలను అభివృద్ధి చేసి అందించనుంది. దిల్ రాజు ఈ సహకారం గురించి మాట్లా డుతూ, సినిమా నిర్మాణంలో ఏఐ సాంకేతికత ద్వారా కొత్త అవ కాశాలను సృష్టించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ ప్రక టనసినీఅభిమానులు,ఇండస్ట్రీ నిపుణులలో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# హరిహరవీరమల్లు పవన్ యాక్షన్ సీన్స్

పవన్ కల్యాణ్ కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'హరి హర వీరమల్లు' క్రిష్, జ్యోతి కృష్ణ దర్శకత్వంలో పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్‌గా సిద్ధమవుతోంది. తాజాగా ఈ సినిమాపై జ్యోతికృష్ణ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. ఇందులో ఒక యాక్షన్ సీక్వెన్స్‌ను రూపొందించే బాధ్యత పవన్ కల్యాణ్ తీసుకున్నారు. ఈ సినిమాలో మొత్తం ఆరు యాక్షన్ సీక్వెన్స్‌లు ఉన్నాయి. 20 నిమిషాలపాటు– ఉండే ఒక దాన్ని పవన్ రూపొందించారు. ఇది ఎంతో ప్రత్యేకమైనది. ఈ సీక్వెన్స్‌లో 1100 మంది పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ స్టూడియోలో 61 రోజులు దీన్ని చిత్రీకరించాం. దీని కోసం ఆయన ఎంతో కష్టపడ్డారు. గ్రౌండ్ వర్క్ చేశారు. అంతర్జాతీయ స్టంట్ కొరియోగ్రాఫర్లతో చర్చించారు. సినిమా మొత్తంలో ఇదే హైలైట్ కానుందని తెలిపారు. ఇక ఈ సినిమా కోసం ఆయన ప్రత్యేకంగా గుర్రపు స్వారీలో శిక్షణ తీసుకున్నట్లు జ్యోతికృష్ణ తెలిపారు. ఇందులో పవన్ కల్యాణ్ సరసన నిధి అగర్వాల్ నటిస్తోన్న విషయం తెలిసిందే. ఆమె కూడా ఇటీ–వల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ సినిమాలోని ప్రతి అంశంలో పవన్ భాగమయ్యారని తెలిపారు. రెండు పార్ట్‌లుగా తెరకెక్కుతున్న ఈ చిత్రం తొలి భాగం 'హరి హర వీరమల్లు పార్ట్–1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో మే9న ప్రేక్షకుల ముందుకు రానుంది.




# ఏడాది చివరలో స్పిరిట్ సెట్స్‌లోకి ప్రభాస్




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, అర్జున్ రెడ్డి, యానిమల్ చిత్రాల దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా కాంబోలో రాబోతున్న ప్రాజెక్ట్ 'స్పిరిట్' భారీ బడ్జెట్‌తో నిర్మించనుండగా.. ప్రస్తుతం ప్రీ ప్రోడక్షన్ పనులు జరుపుకుంటుంది. అయితే ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి అప్‌డేట్స్ కోసం ప్రభాస్ అభిమానులంతా కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ మూవీకి సంబంధించి ఒక అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఏడాది చివరిలో 'స్పిరిట్' సెట్స్ మీదకి వెళ్లనున్నట్లు టాక్ నడుస్తున్న విషయం తెలిసిందే. దీనికి సంబంధించి మరో అప్‌డేట్ వచ్చింది. ప్రభాస్ ప్రస్తుతం ఉన్న ప్రాజెక్ట్‌లను పూర్తి చేసిన తర్వాతే సందీప్ రెడ్డి స్పిరిట్‌లో జాయిన్ కాబోతున్నట్లు తెలుస్తుంది. స్పిరిట్ షూటింగ్ మొత్తం 120 రోజులకు పైగా జరగనుందని, అందులో 90 రోజులకు పైగా ప్రభాస్ పాల్గొననున్నారని సమాచారం. ఈ సినిమా కోసం ప్రభాస్ జిమ్‌లో తీవ్రంగా వర్కవుట్ చేస్తూ కొత్త లుక్‌ను సిద్ధం చేస్తున్నారట. ఇప్పటివరకూ చూడని ప్రత్యేకమైన లుక్‌లో ఆయన ఈ చిత్రంలో కనిపించనున్నట్లు– తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి తాజాగా అమెరికాలో జరిగిన ఓ కార్యక్రమంలో దర్శకుడు సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ.. స్పిరిట్ సినిమా షూటింగ్‌ను మెక్సికోలో జరుపబోతున్నట్లు ప్రకటించాడు. ఇంతకంటే ఏం అప్‌డేట్ ఇవ్వలేమని తెలిపాడు. దీంతో ఈ సినిమాకు సంబంధించిన ఏ వార్త అయినా క్షణాల్లో వైరల్ అవుతోంది. తాజాగా దీనికి సంబంధించిన కొన్ని వార్తలు సోషల్ మీడియాలో షేర్ అవుతున్నాయి. ఈ షెడ్యూల్‌లో 90 రోజులకు పైగా ప్రభాస్ పాల్గొననున్నారని టాక్. తన లుక్ కోసం జిమ్‌లో వర్క్‌వుట్ చేయనున్నారట. ఇందులో ప్రభాస్ ఇప్పటివరకూ చూడని లుక్‌లో కనిపించనున్నట్లు– సమాచారం. తాజాగా యూఎస్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో సందీప్ వంగా మాట్లాడుతూ దీని షూటింగ్ అప్‌డేట్ పంచుకున్నారు. చిత్రీకరణ కోసం మెక్సికోలోని కొన్ని ప్రాంతాలు పరిశీలిస్తున్నట్లు– తెలిపారు. సందీప్ వంగాకు సంబంధించిన మరో వార్త కూడా నెట్టింట వైరల్‌గా మారింది. ఈ డైరెక్టర్ రామ్‌చరణ్‌తో ఓ సినిమా చేయనున్నట్లు– తెలుస్తోంది. రామ్ చరణ్ 'పెద్ది' పూర్తయిన తర్వాత ఈ సినిమా ప్రారంభించ నున్నట్లు తెలుస్తోంది. దీనిపై అధికారిక ప్రకటన కోసం చరణ్ అభిమానులు ఎదురుచూస్తున్నారు.

# అరుంధతి, అమ్మోరు లాంటి సినిమా

**ఓదెల-2పై శర్వానంద్ ఆసక్తికర కామెంట్స్**

'ఓదెల 2' టీ–జర్ చూడగానే 'అరుంధతి', 'అమ్మోరు' సినిమాలు చూసిన అనుభూతి కలిగింది. ఏదో మ్యాజిక్ జరగనుందనే నమ్మకం నాకుందని కథానాయకుడు శర్వానంద్ అన్నారు. ఆయన ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 'ఓదెల 2' ప్రీరిలీజ్ వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తమన్నా ప్రధాన పాత్రలో సంపత్ నంది సూపర్ విజన్‌లో రూపొందిన పాన్ ఇండియా చిత్రమిది. అశోక్ తేజ దర్శకత్వం వహించారు. హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్ సింహ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 17న విడుదల కానున్న నేపథ్యంలో ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా శర్వానంద్ మాట్లాడుతూ.. 'సంపత్ నందితో ఏడాదిగా కలిసి ప్రయాణిస్తున్నా. ఆయనొక అడిక్షన్. తమన్నా ఆయనతో నాలుగు చిత్రాలు చేశారంటే మామూలు విషయం కాదు. నాకు ఆమెను హీరోయిన్ అని పిలవడం ఇష్టం లేదు. తనొక అద్భుతమైన ఆర్టిస్ట్. రెండు దశాబ్దాలుగా కథానాయికగా కొనసాగడం మామూలు విషయం కాదు. ఒక మాస్ సినిమా కోసం ప్రేక్షకులు ఎలా అయితే ఎదురు చూస్తారో.. 'ఓదెల 2' కోసం అంతే ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ చిత్ర ఓపెనిం గ్స్ అదిరిపోతాయని నేను బలంగా నమ్ము తున్నా. టీజర్, –ట్రైలర్స్ నాకు బాగా నచ్చాయి. అందరూ కలిసి చాలా మంచి సినిమా చేశారు. ఈ వేసవికి ఇదే బ్లాక్‌బస్టర్ అవుతుందని నా నమ్మకం అన్నా రు. ఈ సినిమా, శివశక్తి పాత్ర నా కెరీర్‌లో చాలా ప్రత్యేకం అని తమన్నా అన్నారు. ఈ చిత్రంలో భాగం కావడం అదృ ష్టంగా భావిస్తు న్నా. తప్పకు ండా ఇది అందరికీ నచ్చుతుంది. మీ స్పందన కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నా అంది.




# బంధం బలంగా ఉండాలంటే.. ఒంటరితనం రావద్దు

**● రష్మిక హాట్ కామెంట్స్**

ప్రజంట్ బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్ లో బాగా వినిపిస్తున్న పేరు రష్మిక మందన. సక్సెస్‌లతో దూసుకపోతున్న ఈ ముద్దుగుమ్మ క్షణం తీరిక లేకుంగా వరుస షూటింగ్‌లతో బిజీగా ఉంది. బాలీవుడ్‌లో క్రేజీ స్టార్‌గా మారిపోయిన రష్మిక.. ఆయుష్మాన్ ఖురానా తో 'థామా' అనే చిత్రంలో బిజీగా ఉంది. ఇది హారర్ మూవీ కావడంతో గత కొన్ని రోజుల నుంచి నైట్ షూట్ అంటూ తిరుగుతోంది. ఇక మూవీస్ విషయం కాస్త పక్కన పెడితే. రౌడి హీరో విజయ్, రష్మిక ఇద్దరు డేటింగ్‌లో ఉన్నారన్నే వార్తలు ఎప్పటి నుంచో వింటున్నాం. చాలా సార్లు వీరిద్దరు మేము జస్ట్ ఫ్రెండ్ అని చెప్పిన.. ఏ వెకేషన్‌లకు వెళ్లినా ఇద్దరు కలిసే వెళతారు. ఇద్దరూ ఒకే చోట ఉంటారు.. కానీ వేర్వేరు ఫొటోలను షేర్ చేస్తుంటారు. అయితే తాజాగా రష్మిక రిలేషన్ షిప్ గురించి ఓ పోస్ట్ పెట్టింది.. రష్మిక కెరీర్ పరంగా ఎంత బిజీగా ఉన్నప్పటికీ సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్ గా ఉంటుంది. ఎప్పటికప్పుడు ఆమెకు సంబంధించిన ప్రతి ఒక అప్ డేట్ అభిమానులతో పంచుకుంటూ ఉంటుంది. ఇందులో భాగంగా తాజాగా 'రిలేషన్ స్ట్రాంగ్‌గా ఉండాలంటే పాటించాల్సిన రూల్ ఏంటో తెలుసా? ఎప్పుడూ ఏ క్షణం అయినా సరే ఒంటరిగా బాధపడే రోజు రాకుండా చూసుకోవాలి.. కష్టసుఖాల్లో ఇద్దరూ ఒకరికి ఒకరు తోడుగా ఉంటూ.. ఎట్టి పరిస్థితుల్లోనూ చేయి విడవద్దు అనే రూల్ పెట్టుకుంటే చాలు' అని ఎక్కడో వచ్చిన ఓ పోస్ట్‌ను, తన ఇన్ స్టా స్టోరీలో షేర్ చేసింది. అంతే కాదు 'ఈ రూల్‌ని నేను కూడా నేను కూడా అంగీకరిస్తున్నా.. ఒప్పుకుంటున్నా' అని రష్మిక రాసుకొచ్చింది.



# డ్రగ్స్ అలవాటున్న వారితో నటించను

**- మళయాల నటి విన్సీ సోనీ అలోషియన్**

డ్రగ్స్ అలవాటున్న హీరోలతో ఇకముందు నటించకూడదని మళయాల నటి విన్సీ సోనీ అలోషియస్ నిర్ణయం తీసుకున్నారు. గతంలో తనకు ఎదురైన చేదు అనుభవాన్ని గుర్తుచేసుకున్న నటి విన్సీ ఈ విషయం చెప్పారు. ఒక సినిమా సెట్స్‌లో హీరో తనతో అసభ్యకరంగా ప్రవర్తించాడని తెలిపారు. అయితే అతడి పేరును మాత్రం విన్సీ వెల్లడించలేదు. సినిమా షూటింగ్ సమయంలో ఆ హీరో డ్రగ్స్ తీసుకున్నాడు. నాతో అనుచితంగా ప్రవర్తించాడు. ఆ షూటింగ్ జరిగినన్ని రోజులు ఎంతో ఇబ్బందిపడ్డా. తన ముందే దుస్తులు మార్చుకోమని ఇబ్బందిపెట్టాడు. అందరి ముందే ఇలాంటి మాటలు మాట్లాడేవాడు. నా జీవితంలో ఇది ఒక అసహ్యకరమైన సంఘటన. దీని తర్వాత ఇక డ్రగ్స్ అలవాటు ఉన్న నటులతో నటించకూడదని నిర్ణయించుకున్నాను. నేను తీసుకున్న ఈ నిర్ణయం వల్ల బహుశా భవిష్యత్తులో నాకు సినిమాల్లో ఎక్కువ అవకాశాలు రాకపోవచ్చు. కానీ, ఈ విషయాన్ని బహిరంగంగా చెబుతున్నాను. ఈ వ్యసనం ఉన్న వారితో నేను నటించను. నాతో అలా ప్రవర్తించిన నటుడి గురించి అందరికీ తెలుసు కానీ ఎవరూ స్పందించలేదు. డ్రగ్స్ తీసుకోవడం అతడి పూర్తి వ్యక్తిగత విషయం కావచ్చు.. కానీ, వృత్తిపరమైన వాతావరణంపై అది ప్రభావం చూపకూడదు. ఇది ఆమోదయోగ్యం కాదని విన్సీ అన్నారు. ప్రస్తుతం విన్సీ సోనీ ఆరోపణలు మలయాళ ఇండస్ట్రీల్రో చర్చనీయాంశంగా మారాయి. ఇప్పటికే ఈ పరిశ్రమలో ఎంతోమంది మహిళలు కాస్టింగ్ కౌచ్, లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నారని జస్టిస్ హేమ కమిటీ– గతేడాది ఓ నివేదిక స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో నటి వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

